క్లుప్తంగా

అంబేడ్కర్ అందరివాడు



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అయినవిల్లి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరివాడని పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. అయినవిల్లి మండలం కొండుకుదురులంక గుర్రాలవారిపేటలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరీ, జనసేన నాయకుడు శెట్టిబత్తుల రాజుబాబు, సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఏఎంసీ డైరెక్టర్ వేటుకూరి వెంకట్రాజు, జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, సర్పంచ్ మేడిద దుర్గాప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు గుర్రాల రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

ఆలమూరు: అర్హులైన వారందరూ ఓటు హక్కు నమోదు చేయించుకుని, ప్రజాస్వామ్య పరిరక్షణకు తోడ్పాటును అందించాలని కొత్తపేట ఆర్డీఓ ఎం.ముక్కంటి అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ ఐపీ శెట్టి అధ్యక్షతన బూత్ లెవెల్ అధికారులకు మంగళవారం సమీక్ష సమావేశం జరిగింది. డివిజన్ ఎలక్ట్రోరల్ అధికారిగా ఆర్డీఓ, అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ అధికారిగా తహసీల్దార్ వ్యవహరించారు. 18 గ్రామాల పరిధిలోని 62 మంది బూత్ లెవెల్ అధికారులందరూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని వారు సూచించారు. ఓటు బదిలీ, చిరునామా మార్పులు, ఓటర్ల జాబితాలో తప్పులను సవరించాలని చెప్పారు. సమావేశంలో ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణహిత జీవన శైలి అలవరచుకోవాలి

అంబాజీపేట: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పర్యావరణ హిత జీవన శైలిని అలవరచుకోవాలని ఫారెస్ట్ సెక్షన్ అధికారి ఎం.రామిరెడ్డి అన్నారు. పర్యావరణహిత జీవన శైలిపై అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు హెచ్‌ఎం బీర హనుమంతరావు అధ్యక్షతన మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, శక్తి వనరులను, నీటిని పొదుపుగా వాడాలని సూచించారు. ఒకసారి మాత్రమే వినియోగించే ప్లాస్టిక్ వాడవద్దని, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తగ్గించాలని, సుస్థిర ఆహార పద్ధతులు అలవరచుకోవాలని చెప్పారు. అనంతరం పర్యావరణాన్ని కాపాడుకోవాలంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

డాక్టర్ ప్రతాప్‌కు సత్కారం

సఖినేటిపల్లి: వీవీ మెరక గ్రామానికి చెందిన శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్‌ను కర్నూలులో శ్రీశ్రీ కళావేదిక ప్రతినిధులు, కవులు సత్కరించారు. ఆయన ఈ విషయం మంగళవారం తెలిపారు. వేదిక ఆధ్వర్యాన కర్నూలు టీజీఆర్ కళాక్షేత్రంలో జాతీయ స్థాయి శతాధిక కవి సమ్మేళనం, సాహిత్య సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌ను సత్కరించారు.

గంజాయితో ముగ్గురి అరెస్టు

ఆత్రేయపురం: పోలీసులు గంజాయి స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అరెస్టు చేశారు. ఎస్సై సీహెచ్ సుధాకర్ మంగళవారం తెలిపిన వివరాలివీ.. ర్యాలి గ్రామానికి చెందిన ఎం.శివశంకర్, వి.గణేష్, అమలాపురానికి చెందిన సీహెచ్ రాజు కలిసి, అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి గంజాయిని తీసుకువస్తున్నారు. ప్రయాణికుల్లా బ్యాగుల్లో గంజాయి పెట్టుకుని వచ్చి, పలు గ్రామాల్లో యువకులకు అమ్ముతున్నారు. వీరిపై పోలీసులు నిఘా పెట్టారు. స్థానిక లొల్ల లాకుల సమీపాన ఇరిగేషన్ బంగ్లా వద్ద ఈ ముగ్గురినీ రావులపాలెం సీఐ రజనీకుమార్ అరెస్టు చేశారు. వారి నుంచి 21.5 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కొత్తపేట కోర్టులో హాజరు పరిచారు. ఈ నిందితులపై గతంలో కూడా కేసులు నమోదయ్యాయి. సీఐ వెంట ఎస్సై సుధాకర్, ఇన్‌చార్జి తహసీల్దార్ మృత్యుంజయరావు, ఆర్ఐ భవాని, ఏఎస్సై ప్రసాద్, వీఆర్ఓ జ్యోతి తదితరులున్నారు.

మొబైల్ మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

అంబాజీపేట: సాకా చిన్నిబాబు మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సాకా ప్రసన్న కుమార్ ఆధ్వర్యాన మొబైల్ మజ్జిగ చలివేంద్రాన్ని అంబాజీపేటలో మంగళవారం ప్రారంభించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఇరుసుమండలో కోనసీమ ఆహార నిధి చైర్మన్ వీరంశెట్టి సతీష్, రాంబాబు ఆధ్వర్యాన మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు.

చిత్తడిగా కొర్లగుంట రోడ్డు

మామిడికుదురు: ఉన్నట్టుండి సోమవారం రాత్రి కురిసిన వర్షానికి మామిడికుదురు శివారు కొర్లగుంట గ్రావెల్ రోడ్డు చిత్తడిగా మారింది. దీనిపై వాహనాలు జారిపోయి పలువురు గాయపడ్డారు. ఈ రోడ్డు సుమారు 200 మీటర్ల మేర అధ్వానంగా ఉంది. దీనిని ఇటీవల అభివృద్ధి చేసి మెటల్‌పై గ్రావెల్ వేశారు. వర్షానికి గ్రావెల్ బురదగా మారి వాహనాలు జారిపోతున్నాయి. ఇటీవల కురిసిన అకాల వర్షాల సమయంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఈ రోడ్డును బాగు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పాలన చేరువై.. ప్రజల గుండెల్లో కొలువై

- నాడు అరకొర పథకాలు.. అవీ పచ్చ చొక్కాలకే మంజూరు
- నేడు అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు
- నాలుగేళ్ల జగనన్న పాలనపై జనం నమ్మకం



కొత్తపేటలో వితంతు మహిళకు ఇంటి వద్దనే పింఛను అందిస్తున్న వలంటీర్

కొత్తపేట: రేవు దాటి తెప్ప తగలెట్టిన చందాన.. ఇచ్చిన హామీలను అధికారం చేపట్టాక గాలికొదిలేయడం గత టీడీపీ పాలకుల నైజం. చేసేదే చెప్పడం .. ఇచ్చిన మాటకు కట్టుబడటం.. చెప్పినవే కాకుండా చెప్పని పథకాలు కూడా అమలు చేయడం జగని జం. నాడు టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నారో.. నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎలాంటి మేలు పొందుతున్నారో ప్రజలకు కళ్ల ముందే కనిపిస్తోంది. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన నాలుగేళ్లు పూర్తి చేసుకుని, ఐదో వసంతంలోకి అడుగు పెట్టింది. నాలుగేళ్లనాడు ఎన్నికల ముందు విపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'సంక్షేమ సంతకం' పేరిట జగనన్న మేనిఫెస్టో–2019 విడుదల చేశారు. ఆయన మాటను ప్రజలు నమ్మారు. అఖండ మెజార్టీతో పట్టం కట్టారు. ఒంటరిగా పోటీ చేసి, అద్భుత విజయం సాధించిన పార్టీ అధినేతగా ఆయన దేశవ్యాప్తంగానే రికార్డు సృష్టించారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తూ తన మేనిఫెస్టోను భగవద్గీతలా, బైబిల్‌లా, ఖురాన్‌లా భావిస్తానని, చిత్తశుద్ధితో పని చేస్తానని రాష్ట్ర ప్రజలకు మాటిచ్చారు. దానిని తు.చ. తప్పకుండా నిలబెట్టుకుంటూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను దాదాపు 99 శాతం అమలు చేశారు. తద్వారా మేనిఫెస్టోకు సరికొత్త నిర్వచనం ఇచ్చిన ముఖ్యమంత్రిగా చరిత్ర సృష్టించారు. పేద, మధ్య తరగతి కుటుంబాల్లో వెలుగులు నింపారు. జగన్ చెబితే చేస్తారనే నమ్మకం ప్రజల్లో పూర్తిగా కలిగించారు.

నాడు.. నేడు.. తేడా చూడు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సామాజిక పింఛన్ల కోసం వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర లబ్ధిదారులు పంచాయతీ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. పింఛను ఎప్పుడిస్తారా అని ఉదయం నుంచీ ఎండలో పడిగాపులు పడాల్సి వచ్చేది. నెట్‌వర్క్ సమస్య వంటి కారణాలతో ఒక్కోసారి పింఛన్లు ఇచ్చేవారు కాదు. దీంతో ఉసూరుమని నిట్టూరుస్తూ ఇంటి ముఖం పట్టి, మళ్లీ మర్నాడు వెళ్లే వారు. దూర ప్రాంతాల వారు రిక్షా లేదా ఆటోలో వెళ్లి పింఛన్లు తెచ్చుకునేవారు.

నాడు విపక్ష నేతగా వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప పాదయాత్ర చేసినప్పుడు పింఛనుదార్ల కష్టాలను కళ్లారా చూశారు. వారి కష్టాలను కడతేర్చాలని నాడే ఆలోచించారు. ఫలితంగా నేడు ప్రతి నెలా ఒకటో తేదీనే లబ్ధిదార్ల ఇళ్లకు గ్రామ వలంటీర్లు స్వయంగా వెళ్లి తలుపు తట్టి మరీ పింఛన్లు అందిస్తున్నారు. దీంతో తమ కష్టాలు గట్టెక్కాయని పింఛనుదార్లు సంతోషిస్తున్నారు.

వినూత్నంగా సంక్షేమం

గతంలో వివిధ ప్రభుత్వాలు అమలు చేసిన పథకాలకు మెరుగులు దిద్దడంతో పాటు గతంలో కనీవినీ ఎరుగని వినూత్న పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారు. 45 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు 'వైఎస్సార్ చేయూత' పథకం కింద ఏడాదికి రూ.18,750 ఆర్థిక సాయం అందిస్తున్నారు. కాపు మహిళలకు 'వైఎస్సార్ కాపు నేస్తం' కింద రూ.15 వేల ఆర్థిక సాయం ఇస్తున్నారు. చేనేత కార్మికులకు 'వైఎస్సార్ నేతన్న నేస్తం' కింద రూ.24 వేలు, విద్యా ప్రోత్సాహంలో భాగంగా 'జగనన్న అమ్మ ఒడి' పథకం కింద రూ.15 వేలు, అగ్రకులాల్లో పేద మహిళలకు 'వైఎస్సార్ ఈబీసీ నేస్తం' కింద రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నారు. అలాగే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక, ఫీజు రీయింబర్స్‌మెంట్, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, రైతులకు వైఎస్సార్ రైతు భరోసా, సున్నా వడ్డీ, ఉచిత పంటల బీమా, డ్వాక్రా మహిళలకు వడ్డీ మాఫీ, వైఎస్సార్ ఆసరా, ఇంకా మత్స్యకార భరోసా, వైఎస్సార్ వాహనమిత్ర, టైలర్లు, నాయీ బ్రాహ్మణులు, రజకులకు జగనన్న తోడు వంటి వినూతన్న సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. వీటితో పాటు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఆరోగ్యశ్రీ ఆసరా, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, జగనన్న గోరుముద్ద, వ్యవసాయానికి 9 గంటల ఉచిత విద్యుత్ వంటి ఎన్నో పథకాలను అద్భుతంగా అమలు చేస్తూ జనం మన్ననలు అందుకుంటున్నారు.

ప్రగతి పథం..

సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా పెద్ద పీట వేస్తున్నారు. నాడు – నేడు పేరుతో పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, హాస్టళ్లను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేశారు. ఎక్కడికక్కడ వివిధ రోడ్లను ఆధునీకరించారు. గ్రామాల్లో ఇంటర్నల్ సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు, తాగునీటి పథకాలు నిర్మించారు. పాలనను ప్రజలకు చేరువ చేయడానికి గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారు. వీటితో పాటు రైతులకు గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాలు, వైద్యానికి సంబంధించి వెల్‌నెస్ సెంటర్లు, తాజాగా ఫ్యామిలీ డాక్టర్ వంటి కార్యక్రమాలు చేపట్టారు. సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సాగిస్తున్న పాలన ఫలితాలు ప్రజల కళ్లకు కట్టినట్టు కనిపిస్తున్నాయి. కరోనా కష్టకాలంలో సైతం ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడకుండా సంక్షేమ పథకాలు అమలు చేసిన సీఎం జగన్ పట్ల ప్రజలు విశ్వసనీయత వ్యక్తం చేస్తున్నారు.

పింఛనుతో బతుకుతున్నా..



ఒంటరిగా జీవిస్తున్నా. నాడు మహానుభావుడు రాజశేఖరరెడ్డి పుణ్యమా అని నాకు పింఛను మంజూరైంది. నేడు ముఖ్యమంత్రి జగన్‌బాబు పుణ్యమా అని ప్రతి నెలా ఒకటో తారీకునే వలంటీర్ అమ్మాయి తెల్లవారకుండానే ఇంటి వద్దకే పింఛను తెచ్చి ఇస్తోంది. పింఛను కోసం కష్టపడి ఎక్కడికో వెళ్లి పడిగాపులు పడాల్సిన బాధ తప్పింది. అంతేకాకుండా ఏటా పింఛను డబ్బులు పెంచుతూ ప్రస్తుతం రూ.2,750 ఇస్తున్నారు. ఇంటి వద్దకే రేషన్ తెచ్చి ఇస్తున్నారు. ఇంతకంటే ఇంకేం కావాలి? జగన్ బాబు పది కాలాల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగాలని దేవుడిని కోరుకుంటున్నాను.

– గొలకోటి నాగరత్నం, కొత్తపేట

జగన్ పాలన సంతృప్తికరం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చాలా సంతృప్తికరంగా సాగుతోంది. ఎన్నికల ముందు చెప్పినవి చెప్పినట్టుగా అమలు చేశారు. నిజంగా మహిళా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని వివిధ పథకాలు మా పేరున అమలు చేస్తున్నారు. జగన్ పాలనలో ప్రతి మహిళా సంతోషంగా ఉంది. చేయూత, ఆసరా పథకాల ద్వారా లబ్ధి పొందాను.

– కుడ్రా లక్ష్మి, కొత్తపేట

చాలా సంతోషంగా ఉన్నాం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన అందిస్తున్నారు. మావంటి వెనుకబడిన వర్గాలతో పాటు అన్ని వర్గాల్లోని పేదలకు జగనన్న ప్రభుత్వం అండగా నిలిచింది. మాకు జగనన్న తోడు, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత పథకాల ద్వారా ప్రభుత్వ సాయం అందుతోంది. గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఈవిధంగా మేలు జరగలేదు. ఈ ప్రభుత్వంలో చాలా సంతోషంగా ఉన్నాం.

– కింతాడ సత్యనారాయణ, కొత్తపేట

అవినీతి నిర్మూలనకు వలంటీర్ వ్యవస్థ



వలంటీర్ల సన్మానంలో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టిబాబు



మలికిపురంలో వలంటీర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రాపాక

మామిడికుదురు: అవినీతిని నిర్మూలించి ప్రజలకు పారదర్శకంగా సేవలందించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టిందని పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా బి.దొడ్డవరం, నగరం గ్రామాల్లోని వలంటీర్లను మంగళవారం ఆయన ఘనంగా సత్కరించారు. సేవారత్న, సేవామిత్ర పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాల్సిన గురుతర బాధ్యత వలంటీర్లపై ఉందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చెల్లుబోయిన రామశివ సుబ్రహ్మణ్యం, జాలెం రమణకుమారి, ఎంపీటీసీ సభ్యులు వాసంశెట్టి వెంకటరమణ, జాలెం అనూష, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, జేసీఎస్ కన్వీనర్ జక్కంపూడి వాసు, కార్యదర్శులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ ద్వారా అవినీతిలేని సంక్షేమ పాలన

మలికిపురం: వలంటీర్ వ్యవస్థ ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అవినీతి లేని సంక్షేమపాలన అందిస్తున్నారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మలికిపురం పంచాయతీ వద్ద మంగళవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. అవార్డులు పొందిన వలంటీర్లను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి తిరుగు లేని ఆదరణ

- ఎమ్మెల్యే చిట్టిబాబు
- అప్పనపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం



గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

మామిడికుదురు: వైఎస్సార్ సీపీకి ప్రజల్లో తిరుగులేని ఆదరణ ఉందని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం పీఠం అధిష్ఠించాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. అప్పనపల్లిలో మంగళవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న ప్రజలు మళ్లీ జగన్ నాయకత్వాన్నే కోరుకుంటున్నారని చిట్టిబాబు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ గెడ్డం మంగాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు బొంతు నీలిమ, జేసీఎస్ ఇన్‌చార్జి జక్కంపూడి వాసు, దేవస్థానం మాజీ చైర్మన్ పిచ్చుక చిన్న, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బత్తుల జనార్దన్, ట్రస్టీలు గూటం శ్రీను, చిట్టాల సత్తిబాబు, పంచాయతీ కార్యదర్శి కోటయ్య, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటి ముంగిటే వైద్య సేవలు

- జిల్లాను మాతృ, శిశు మరణాల రహితంగా తీర్చిదిద్దుతున్నాం
- డీఎంహెచ్ఓ దుర్గారావుదొర



పెదపళ్ల పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ దుర్గారావుదొర

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజలకు ఇంటి ముంగిటే వైద్య సేవలు అందిస్తున్నామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) ఎం.దుర్గారావుదొర అన్నారు. పెదపళ్ల పీహెచ్‌సీని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ, జిల్లాలోని 54 పీహెచ్‌సీల పరిధిలో అత్యంత అనుభవం కలిగిన 108 మంది వైద్యాధికారులు ఫ్యామిలీ డాక్టర్ సేవలు అందిస్తున్నారని చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ వాహనాలతో ప్రతి నెలా రెండు సార్లు గ్రామ సచివాలయాలను సందర్శించి, సుమారు లక్ష మందికి ఇంటి ముంగిటే వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. సాధారణ, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు 72 రకాల మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లా ఏర్పడిన తరువాత భారీ స్థాయిలో వైద్య, ఆరోగ్య, పారా మెడికల్ సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించామని డీఎంహెచ్ఓ తెలిపారు. పీహెచ్‌సీల్లో 24 గంటలూ వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. జిల్లాను మాతృ, శిశు మరణాల రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నామని చెప్పారు. సాధారణ ప్రసవాలను పెంచేందుకు ఆరోగ్య సిబ్బందికి విధించిన లక్ష్యాలు సత్ఫలితాలను ఇస్తున్నాయన్నారు. వలస కూలీల ఆరోగ్య రక్షణకు మొబైల్ బృందాలు ఏర్పాటు చేశామన్నారు. చిన్నారులకు టీకాలు, పాము, కుక్కకాటు వ్యాక్సిన్లను నిత్యం అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. పీహెచ్‌సీల్లో ప్రతి వారం ప్రత్యేక వైద్య నిపుణులను రప్పించి, వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. అనంతరం పీహెచ్‌సీలో రికార్డులను డీఎంహెచ్ఓ దుర్గారావుదొర పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్య, ఆరోగ్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, సాధారణ ప్రసవాలను రికార్డు స్థాయిలో పెంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఆర్.సుదర్శన్‌బాబు, పి.భవానీ శంకర్, సీహెచ్ఓ పి.వెంకటరత్నం, హెచ్ఈ ఏవీవీ రాజా అక్కుల తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే వైఎస్సార్ సీపీకి వెన్నెముక

- ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి
- ఆలమూరులో ఘనంగా నాలుగేళ్ల పాలనా సంబరాలు



నాలుగేళ్ల పాలనా సంబరాల్లో విప్ జగ్గిరెడ్డి, పార్టీ శ్రేణులు

ఆలమూరు: వైఎస్సార్ సీపీకి కార్యకర్తలే వెన్నెముక అని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయిన సందర్భంగా ఆలమూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు ఆధ్వర్యాన మంగళవారం ఘనంగా సంబరాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జగ్గిరెడ్డి కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజల ఆదరణ, కార్యకర్తల శ్రమతోనే వైఎస్సార్ సీపీ అత్యధిక మెజార్టీతో విజయ దుందుభి మోగించిందని అన్నారు. నాలుగేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలూ శ్రమిస్తూ రాష్ట్రాభివృద్ధికి, పేదరిక నిర్మూలనకు ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో ప్రజా సంక్షేమం కోసం కార్యకర్తలు మరింత చురుకైన పాత్ర పోషించి, వైఎస్సార్ సీపీని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డిని పార్టీ శ్రేణులు ఘనంగా సత్కరించాయి. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు తోరాటి సీతామహాలక్ష్మి, కుడుపూడి శ్రీనివాసరావు, ఎంఏఎస్ అధ్యక్షుడు యనమదల నాగేశ్వరరావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రావాడ సత్తిబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు మోటుపల్లి వెంకన్న, ఆలయ కమిటీ చైర్మన్ వనుం సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

జగ్గిరెడ్డి ఆర్థిక సాయం

గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు యెరుకొండ గణేష్ భార్య దుర్గ మోకాలి శస్త్రచికిత్సకు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. అలాగే సీఎం రిలీఫ్ ఫండ్ కింద వైద్య సేవలు అందించేందుకు ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. గణేష్ నివాసానికి సోమవారం రాత్రి వెళ్లిన ఆయన దుర్గ ఆరోగ్య పరిస్థితిని, యోగక్షేమాలు అడిగి తెలుసుకుని, ఆర్థిక సాయం అందజేశారు. తమ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకున్న జగ్గిరెడ్డికి గణేష్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, సర్పంచ్ నేలపూడి లావణ్య, ఎంపీటీసీ సభ్యురాలు ఉన్నమట్ల విజయకుమారి, ఉప సర్పంచ్ చల్లా సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

అయినవిల్లి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని యోగా గురువు శ్రీనివాస్ అన్నారు. యోగా గురువు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత మోటూరి భైరవస్వామి 90వ వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా ఆయనను నల్లచెరువు గ్రామంలో శ్రీనివాస్ మంగళవారం ఘనంగా సత్కరించారు. నల్లచెరువు గ్రామంలో ఉచిత యోగా క్లాసులు ప్రారంభిస్తున్నానని చెప్పారు.

గోగన్నమఠంలో 31న స్వామివార్ల కల్యాణోత్సవం

మామిడికుదురు: గోగన్నమఠంలో కొలువు తీరిన శ్రీ చతుర్భుజ భద్రాద్రి సీతారామస్వామి, శ్రీ, భూ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ వేణుగోపాల స్వామి వార్ల అష్టమ వార్షికోత్సవం ఈ నెల 31న జరగనుంది. ఈ సందర్భంగా ఆ రోజు ఉదయం 5.30 గంటలకు స్వామి వారి ధ్రువమూర్తులకు విశేష అభిషేకం, 8.57 గంటలకు స్వామి వార్ల కల్యాణ మహోత్సవం, 10 గంటల నుంచి అన్న సమారాధన నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. సాయంత్రం 4.40 గంటలకు స్వామి వార్ల గ్రామోత్సవం, రాత్రి 7.35 గంటలకు పుష్పోత్సవం జరుగుతాయని పేర్కొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి గ్రామానికి చెందిన పి.కృష్ణ, ఆండాళ్ దంపతులు రూ.12 వేల విరాళం సమర్పించారు. దాతలకు ఆలయ ఈఓ సత్యనారాయణరాజు చేతుల మీదుగా స్వామి వారి చిత్రపటం అందజేశారు.

మండల పరిషత్‌కు సమస్యల నివేదన



సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ సత్యవాణి తదితరులు

మలికిపురం: ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో సభ్యులు వివిధ సమస్యలను ప్రస్తావించారు. వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై ఆయా శాఖల వారీగా అధికారులతో ఎంపీడీఓ యు.బాబ్జీరాజు సమీక్షించారు. గ్రామాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉందని సర్పంచ్‌లు యెనుముల నాగు, రాపాక ఆనందకుమార్ సమావేశం దృష్టికి తెచ్చారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిధులను సర్పంచ్‌ల ప్రమేయం లేకుండా ఇవ్వడంపై విశ్వేశ్వరాయపురం సర్పంచ్ సీహెచ్ హెలీనా అభ్యంతరం తెలిపారు. దిండిలో తాగునీటి పైపులైన్లు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు విషయంలో రాజకీయాలు చోటుచేసుకుంటున్నాయని సర్పంచ్ శ్రీనివాసరాజు ఆరోపించారు. గృహ నిర్మాణ రంగంలో మండలానికి యూడీఏ కింద 830 దరఖాస్తులు పంపామని సంబంధిత అధికారి బాలకృష్ణ తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కందికట్ల నిర్మల, ఐసీడీఎస్ సీడీపీఓ రమాదేవి, తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావు, పీఆర్ డీఈఈ శ్రీరామకృష్ణ, పీహెచ్‌సీ వైద్యాధికారి కె.క్రాంతికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

శరత్‌బాబు మృతికి సంతాపం

కొత్తపేట: సినీ నటుడు శరత్‌బాబు మృతికి కొత్తపేట కళాసాహితి మంగళవారం సంతాపం ప్రకటించింది. సినీ పరిశ్రమకు వచ్చిన తొలినాళ్లలో హీరోగా, తరువాత క్యారెక్టర్, సహాయ నటునిగా ప్రేక్షకులను ఆయన ఎంతో మెప్పించారని కళాసాహితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెన్మెత్స హరిహర దేవళరాజు, గిడ్డి సుబ్బారావు, సభ్యులు షేక్ గౌస్, ఏబీసీ దేవ్ పేర్కొన్నారు. కళాతపస్వి కె.విశ్వనాథ్ దర్శకత్వంలో జీవితనౌక సినిమా చిత్రీకరణ కోనసీమ ప్రాంతంలో ముఖ్యంగా రావులపాలెం మండలం వెదిరేశ్వరం, కోసూరినగర్ తదితర ప్రాంతాల్లో జరిగిందని గౌస్ తెలిపారు. ఆ సినిమాలో శరత్‌బాబు ప్రముఖ పాత్ర పోషించారన్నారు. షూటింగ్ విరామ సమయంలో కలిసినప్పుడు ఎంతో సరదాగా మాట్లాడారని గుర్తు చేశారు.

ఈదురు గాలుల బీభత్సం



పుల్లేటికుర్రులో ధ్వంసమైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

అంబాజీపేట: మండలంలో మంగళవారం తెల్లవారుజామున వీచిన ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్, వైర్లు ధ్వంసమయ్యాయి. మొసలపల్లిలో కొబ్బరి చెట్టు పడి విద్యుత్ వైర్లు తెగిపోయాయి. చిరతపూడిలో కొబ్బరి చెట్లు పడి రెండు విద్యుత్ స్తంభాలు, పుల్లేటికుర్రు శివారు రాజేశ్వరి కాలనీలో పాడైపోయిన కొబ్బరి చెట్టు వైర్లపై పడడంతో ఒక ట్రాన్స్‌ఫార్మర్, మూడు విద్యుత్ స్తంభాలు ధ్వంసమయ్యాయి. విద్యుత్ శాఖ ఏఈ ఎ.హరిబాబు ఆధ్వర్యాన సిబ్బంది విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.